



ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట్	11.2
రంగారెడ్డి	శేరిలింగంపల్లి	11.6
మేడ్చల్	కొండాపూర్	13.8



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందుకున్న లబ్ధిదారులతో స్పీకర్ ప్రసాద్ కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ప్రత్యేక కోటా కింద చెంచులకు 251 ఇళ్ల మంజూరు
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్/ధారూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో గిరిజన చెంచు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెంచులకు పక్కా ఇల్లు ఉండాలనే సంకల్పంతో వారికి ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మదన్‌పల్లి గ్రామ చెంచు కాలనీలో ఇప్పటికే రూ.7 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో అంతర్గత మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. ఆర్థిక పరిస్థితి బాగుపడగానే అన్ని హామీలను అమలు చేస్తామని అన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ చెంచులకు ఇల్లు అనేది ఒక కల అన్నారు. జిల్లాలోని గిరిజనుల కోసం 251 ఇళ్లను ప్రత్యేక కోటా కింద మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మదన్‌పల్లి గ్రామ చెంచు కాలనీ వాసులకు 29 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను


మిగతా 8వ పేజీలో...



హుండీ సొమ్మును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనంతగిరి హుండీ ఆదాయం రూ.6.02లక్షలు

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంతగిరి కార్తీక మాస పెద్ద జాతర హుండీ ఆదాయం రూ. 6,02,675 వచ్చినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకుల సమక్షంలో హుండీ సొమ్మును లెక్కించారు.



ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు. అన్నట్లుగా ఉంది సామాన్యుల పరిస్థితి. ఒక వైపు బియ్యం, నూనె, పప్పుల ధరలు ఆకాశాన్నంటుతుండగా.. మరో వైపు కూరగాయ ధరలు భగభగమంటున్నాయి. పట్టణ ప్రాంతాలే కాకుండా పల్లెల్లో సైతం ప్రస్తుతం కూరగాయలు కొనే పరిస్థితి లేదు. తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయ పంటలు దెబ్బతినడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. దీంతో ప్రజల అవసరాలకు సరిపడా కూరగాయలు అందుబాటులో లేకపోవడంతో మార్కెట్లలో ధరలు అమాంతం పెరిగాయి.

- పల్లెల్లో సైతం భగభగ
- బెంబేలెత్తుతున్న సామాన్యులు
- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

వంటింట్లో మంటలు

సెంచరీ కొడుతున్న కూరగాయ ధరలు

పలు ప్రాంతాల్లో కూరగాయల ధరలు(కిలో రూ.లలో)

కూరగాయ	ధర	కూరగాయ	ధర
బీరకాయ	80-100	పచ్చిమిర్చి	80
చిక్కుడు	80-100	వంకాయ	60-80
దొండకాయ	80-100	దోసకాయ	60-80
బెండకాయ	80-100	టమాట	60-70
బీన్స్	80-100	క్యాబేజీ	50-60
కాకర	80-90	సొరకాయ	40-60
గోకరకాయ	80-90	ఆలుగడ్డ	40-50
క్యాప్సికమ్	80-90	ఉల్లిగడ్డ	25-30

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

సాధారణంగా హైదరాబాద్ మహానగరానికి ఆనుకుని ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కూరగాయలకు డిమాండ్ ఉంటుంది. నగర ప్రజలకు సరిపడా కూరగాయలు ఎక్కువగా ఉమ్మడి జిల్లా నుంచే సరఫరా అవుతుంటాయి. ఈ కారణంగా కూరగాయలకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, మహారాష్ట్రలో కూడా కూరగాయ పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో హైదరాబాద్‌కు ఈ ప్రాంతాల నుంచి డిమాండ్‌కు తగినంత కూరగాయల సరఫరా జరగడం లేదు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్యుడు కూరగాయలు కొనే పరిస్థితి కనిపించడం లేదు. మార్కెట్లలో పలు కూరగాయల ధరలు ఇప్పటికే కిలో రూ.100 పలుకుతున్నాయి. మిగతావి కూడా కొంచెం అటూ ఇటూ ధరలు పలుకుతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. చిక్కుడు, బెండకాయ, దొండకాయ, బీర ధరలు కిలో రూ. వంద



మార్కును తాకాయి. హైదరాబాద్ నగరంలో కంటే పల్లెల్లో కొన్ని కూరగాయ ధరలు అధికంగా ఉండడం గమనార్హం. ఉదాహరణకు మేడ్చల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పలు కూరగాయ ధరలు హైదరాబాద్ నగరంలో కంటే అధికంగా ఉండడం గమనార్హం. ఇక్కడ చిక్కుడు, బీన్స్, వంకాయ, దోసకాయ, బెండకాయ, క్యాప్సికమ్ ధరలు హైదరాబాద్ నగరంలో

మిగతా 7వ పేజీలో...



వికారాబాద్ ఎస్పీగా స్నేహమెహ్రా

- మహేశ్వరం డీసీపీగా నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్ సౌత్ జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ స్నేహమెహ్రాను వికారాబాద్ కొత్త ఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న నారాయణరెడ్డి రాచకొండ కమిషనరేట్‌లో మహేశ్వరం జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన స్నేహ మెహ్రా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత సైరా ఏసీపీగా, హైదరాబాద్ సైబర్‌క్రైమ్ డీసీపీగా విధులు నిర్వహించారు. వికారాబాద్ పోలీస్ జిల్లాగా ఏర్పాటైన తర్వాత ఈమే నాలుగో మహిళా ఎస్పీ. స్నేహ మెహ్రా విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారని, ప్రజలకు పోలీసులను చేరువ చేసే విధంగా కృషి చేస్తారనే పేరు తెచ్చుకున్నారు.

కాగా, 2024, జూన్ 24న జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డి ఇక్కడ 17 నెలల పాటు పనిచేశారు. సౌమ్యుడిగా పేరుతెచ్చుకున్న ఆయన పలు నేర సంఘటనలను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు. కాగా, లగచర్ల ఘటన ఓ మాయని మచ్చగా మిగిలిపోయింది. ఈ ఘటన పోలీసు వైఫల్యంగానే జరిగిందని తీవ్ర విమర్శలు వ్యక్తమైన విషయం విదితమే.



మిషనరీ పనితీరు గురించి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి.. డయాగ్నొస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్ పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీ డయాగ్నొస్టిక్ హబ్‌లని మిషనరీకి త్వరగా మరమ్మతులు పూర్తి చేసి సేవలను రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించిన శాంపిల్స్‌కు రిపోర్ట్సును త్వరితగతిన పేషెంట్లకు పంపించాలన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'టీ డయాగ్నొస్టిక్ హబ్‌కు జబ్బు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో స్పందించి డయాగ్నొస్టిక్ సెంటర్‌తో పాటు డయాలసిస్ సెంటర్లను పరిశీలించారు. తరచుగా నిర్ధారణ పరీక్షలకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో, టీ హబ్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌తో పాటు అబ్బాట్ కంపెనీ సర్వీస్ ఇంజనీర్‌తో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అలాగే ముఖ్యమైన పరికరాలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. తర్వాత డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి అక్కడి ఇన్‌చార్జికు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

పాలనను పట్టించుకోని పలువురు అధికారులు

- ఫీల్డ్ విజిట్, మీటింగ్‌లు అంటూ విధులకు డుమ్మా
- ఉదయం 11 దాటినా ఆఫీసుల్లో కనిపించని సిబ్బంది
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై సరెండర్ వేటు
- తాండూరు కార్యాలయాల్లో ప్రజలకు అందని సేవలు



తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పాలన గాడి తప్పుతోంది. పలువురు అధికారులు అవినీతికే అధిక ప్రాధాన్యం ఇస్తూ అంతా మా ఇష్టం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. తాండూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్‌చార్జీలు ఉండటం, పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ప్రజల పనులేవీ ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. పనిష్మెంట్ కింద అధికారులు తాండూరుకు వస్తారని జిల్లాలో పేరుంది. ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా అధికారులు వారి పని తీరు మార్చుకోకపోవడం.. పాలనను గాడిలో పెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించక పోవడం వల్ల వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మరో వైపు ప్రతీ చోట

మిగతా 8వ పేజీలో...

పలువురిపై ఉన్నతాధికారుల వేటు

- పంచాయతీరాజ్ శాఖలో ఈఈగా పని చేస్తున్న అధికారి సత్యనారాయణరెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కొడంగల్‌లోని పంచాయతీ రాజ్ పనుల వేగవంతంపై దృష్టి సారించకపోవడం, ఎస్సీ సబ్ ప్లాన్ పనులు, నిధులు మంజూరై టెండర్లు చేసిన పనులను వెంటనే పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్‌లతో సమీక్షంచకపోవడంతో కలెక్టర్ ఆ ఈఈని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే.
- ఇది జరిగిన వారం రోజులకే యాలాల ఎంపీడీవోగా ఉన్న పుష్పలీలను పరిపాలన గ్రౌండ్స్ కింద పంచాయతీరాజ్ కమిషనర్‌కు సరెండర్ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఆమె కూడా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి.
- ఇక పోలీస్ శాఖలో కూడా ఇటీవల వారి పని తీరుపై అసంతృప్తి ఉండగా ఇక్కడ పని చేసిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ సంతోష్ కుమార్‌ను ఐజీ కార్యాలయానికి పెద్దేముల్ ఎస్ఐ వేణును వీఆర్‌కు అటాచ్ చేసిన విషయం విదితమే.



అనుభవించు రాజా..!

పై చిత్రాన్ని గమనిస్తుంటే ఇటీవల వచ్చిన పుష్ప చిత్రంలోని 'ఈ కాలు నాదే.. ఆ కాలు నాదే..' అన్న డైలాగ్ గుర్తుకు రాక మానదు.. రోగులకు సేవలందించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రిలోని కంపౌండర్.. శుక్రవారం వైద్యాధికారి సెలవులో ఉండటంతో దొరికిందే ఛాన్స్ అన్నట్లుగా మద్యం మత్తులో జోగుతూ టేబుల్‌పై కాళ్లు పెట్టి.. సిగరేటు కాల్చుతూ 'అనుభవించు రాజా..' అన్న రీతిలో ఎంజాయ్ చేస్తున్నాడు. పరిగి పట్టణంలోని యూనాని ఆస్పత్రిలో పని చేస్తున్న కాంపౌండర్ చంద్రశేఖర్.. మద్యం మత్తులో చిందులు వేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చంద్రశేఖర్ విధి నిర్వహణలో ఎప్పుడూ ఇలానే చేస్తారని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని కంపౌండర్ దృష్టికి తీసుకెళ్లగా.. 'మా ఆస్పత్రి మా ఇష్టం..' అన్న రితీలో సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ విషయంపై సంబంధిత డాక్టర్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించే ప్రయత్నం చేయగా.. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటం గమనార్హం.

-పరిగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)



బోట్‌లో ప్రయాణిస్తున్న రామ్మోహన్‌రెడ్డి దంపతులు

'లక్నాపూర్'లో బోటింగ్ షురూ

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టులో శుక్రవారం కొత్తగా ఏర్పాటు చేసిన బోటింగ్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగిని పర్యాకటపరంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ బోటింగ్ కొన్ని రోజులు ఉచితంగా ఉంటుందన్నారు. లక్నాపూర్‌తోపాటు, పరిగి శివారులోని కొత్తకుంటను కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు బోట్‌లో ప్రయాణించారు. కార్యక్రమంలో పరిగి, కులకచర్ల, మార్కెట్ కమిటీల చైర్మన్‌లు పరుశరాంరెడ్డి, ఆంజనేయులు, ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారధి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ తరులు పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్యాయం చేయకుండా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు పార్టీపరంగా కాకుండా చట్టబద్ధంగా 42శాతం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పరిస్థితిలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవడం సరి కాదన్నారు. బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి సయ్యద్ షుకూర్, జిల్లా బీసీ మహిళ విభాగం అధ్యక్షురాలు మధులత, వెంకటేశ్, అనిత, మంజుల, నర్సమ్మ, జగదీశ్వరి, పరమేశ్, రమేశ్, రవి కుమార్, కురువ, తదితర నాయకులు పాల్గొన్నారు.



'సీఎంఆర్'పై మిల్లర్ల వెనుకంజ!

21 మిల్లర్లకు అర్హత ఉన్నా ముందుకురాని వైనం



డిఫాల్టర్ అయిన తాండూరులోని కృష్ణసాయి రైస్ మిల్

తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలు రైతుల నుంచి ధాన్యం సేకరించి వాటిని బియ్యంగా మార్చేందుకు సివిల్ సప్లయి శాఖ మిల్లులకు కేటాయించే వడ్లపై మిల్లర్ల నుంచి ఇంకా స్పష్టత రాలేదు. మిల్లర్లు ధాన్యాన్ని సీఎంఆర్‌గా మార్చేందుకు కేటాయించిన వడ్లపై 10 శాతం సివిల్ సప్లయి శాఖకు డిపాజిట్ చూపాల్సి ఉంటుంది. దీనిపై మిల్లర్లు వెనుకంజ వేస్తున్నారు. ధాన్యాన్ని కేటాయించేందుకు జిల్లాలో 21 మిల్లులను గుర్తించగా కేవలం కోడంగల్‌కు చెందిన కొత్తగా ఏర్పాటు చేసిన ఒక రైస్‌మిల్ మాత్రమే బియ్యాన్ని రైస్‌గా ఆడించేందుకు ముందుకు వచ్చింది. అనేక మంది మిల్లర్లు సివిల్ సప్లయి శాఖతో అగ్రిమెంట్ చేసుకునేందుకు జాప్యం చేస్తున్నారు. సివిల్ సప్లయి శాఖ సైతం మిల్లర్లు ధాన్యాన్ని తప్పక తీసుకొని సీఎంఆర్ అందించాలని ఆదేశాలు ఇచ్చింది. గతంలో డిఫాల్టర్‌గా ఉన్న రైస్‌మిల్‌లకు ఈసారి ధాన్యాన్ని కేటాయించొద్దని నిర్ణయం తీసుకున్నారు.

ప్రభుత్వానికి చేరిన 90 శాతం బియ్యం

గత యాసంగికి సంబంధించి ధాన్యం తీసుకున్న మిల్లర్లు 90 శాతం వరకు బియ్యాన్ని సివిల్ సప్లయి శాఖకు అందించారు. వానాకాలానికి సంబంధించి కేటాయించిన ధాన్యం మిల్లర్ల వద్ద ఇంకా నిల్వులు ఉన్నాయి. ఇప్పటికే నిల్వలు ఉండగా మళ్లీ వడ్లను కేటాయిస్తుండడంతో ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని సీఎంఆర్‌గా మార్చే క్రమంలో నూకలు కలువకుండా చూసుకోవాల్సిన బాధ్యత టెక్నీషియన్లు చూసుకోవాలి. అయితే గతంలో డీలర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేసిన సన్న బియ్యంలో అధికంగా నూకలు ఉన్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి సీఎంఆర్ అందించే సమయంలోనే మిల్లర్లు నూకలు కలిపారని ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికైనా బియ్యాన్ని పరీక్షించి సర్టిపై చేసిన తర్వాతే తీసుకోవాల్సిన అవసరం ఉంది.




సుతారిగూడ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

కాలుష్య జలాలపై హైడ్రా నజర్

మేడ్చల్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కండ్లకోయ, సుతారిగూడ చెరువులను శుక్రవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. చెరువుల్లో నీటి శాంపిల్స్‌ను సేకరించి టెస్టింగ్‌కు పంపించారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు అర్చన, శ్రీవల్లి మాట్లాడుతూ సీఎంఆర్ యాజమాన్యం, సీఎంఆర్ హాస్పిటల్స్‌తోపాటు ప్రైవేటు హాస్టల్స్ సంజన అపార్టుమెంట్ వంటి సంస్థల నుంచి వ్యర్థాలు చెరువుల్లో కలిసి నీరు కలుషితం అవుతుందన్నారు. ల్యాబ్‌లో నీటి పరీక్షల అనంతరం వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం బ్యాంక్ ఛైర్మన్ రణధీర్‌రెడ్డి, నాయకులు మల్లేష్, చింతల భాస్కర్, తలారి వెంకటేష్, చింతల హరిబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడు మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారికతతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో సిరిసిల్ల చేనేత కార్మికులతో ప్రత్యేకంగా చీరలు తయారు చేయించామని తెలిపారు. స్వర్గీయ ఇందిరాగాంధీ సహాసోపేత నిర్ణయాలతో దేశంలోని పేదలందరికీ న్యాయం జరిగిందని చెప్పారు. ఇందిరమ్మ సేవలకు స్ఫూర్తిగా పూడూరులో సోనియాగాంధీ, రాజీవ్‌గాంధీనగర్ పేరుతో కాలనీలు నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ నర్సింహులు, డీపీఎం నర్సింహులు, పరిగి, కులకచర్ల, మార్కెట్ కమిటీల ఛైర్మన్లు పరశురాంరెడ్డి, అంజనేయులు, ఆత్మ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి


డీఆర్వో సంగీతకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, డీపీవో సురేష్‌మోహన్‌లకు వినతిపత్రం అందించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆయనవెంట జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.సత్తయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు అంజనేయులు తదితరులున్నారు.

ఫార్మాసిటీ భూముల్లో బోర్డుల ఏర్పాటు



యాచారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కోసం గతంలో ప్రభుత్వం సేకరించిన భూముల్లో రెండు రోజులుగా టీజీఐఐసీ అధికారులు భూమి హద్దుల పక్కన బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మూడు నెలల క్రితం టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను సర్వే నంబర్ల వారీగా సర్వే చేసి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఒక్కో కంపెనీకి సుమారు వెయ్యి ఎకరాలు కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జపాన్‌కు చెందిన మారుబేనీ కంపెనీకి కుర్మిద్ద, మీర్‌ఖాన్‌పేట గ్రామాల మధ్య వెయ్యి ఎకరాలు కేటాయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ మేరకు హద్దులు కూడా ఏర్పాటు చేశారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా హృదయ్‌కుమార్

శామీర్‌పేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా శామీర్‌పేట మండలం అలియాబాద్‌కు చెందిన వంగిరి హృదయ్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం కావడం ఇది రెండోసారి. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ జిల్లా రూరల్ నూతన కార్యదర్శిగా విలాసాగరం సుదర్శన్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తనను జిల్లా ఉపాధ్యక్షుడి బాధ్యతలు అప్పగించినందుకు హృదయ్‌కుమార్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

మన్నెగూడలో షూటింగ్ సందడి


మన్నెగూడ బస్టాండ్‌లో వెబ్ సిరీస్ షూటింగ్

పూడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెగూడ బస్టాండ్‌లో షూటింగ్ సందడి నెలకొంది. విక్రం ఆన్ డ్యూటీ పేరుతో నిర్మిస్తున్న వెబ్ సిరీస్ షూటింగ్ శుక్రవారం మన్నెగూడ బస్టాండ్‌లో తీశారు. ఈ సినిమాలో నటీనటులు నిఖిల్, గాయత్రిపై మన్నెగూడ బస్టాండ్‌లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రానికి డైరెక్టర్ విక్రమ్, నిర్మాత అనిల్ ఉన్నారు. ఈ షూటింగ్‌తో బస్టాండ్ ఆవరణలో సందడి నెలకొంది.


పరిహారం కాదు.. పరివర్తన తేవాలి

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరువు హత్య కేసుల్లో ప్రభుత్వం పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం కాదని, ప్రజల్లో పరివర్తన వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్‌లో శుక్రవారం మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర చంద్రశేఖర్ పరువు హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎర్ర చంద్రశేఖర్‌ను హత్యచేసిన కాగుల వెంకటేష్‌ను శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పరువు హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

చేవెళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని గీత పనివారల సంఘం జిల్లా నాయకుడు మల్గాని సుధాకర్‌గౌడ్ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బషీరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు మొమ్మగాని ప్రభాకర్‌లతోపాటు ఇతర నాయకులు హాజరవుతారిని తెలిపారు. జిల్లాలోని గీత పనివారల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.











కేటీఆర్‌తో జైపాల్‌యాదవ్, జీఎల్ఎన్ రెడ్డి, దశరథ్‌నాయక్

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

కడ్తాల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని కేటీఆర్ సూచించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, కక్ష సాధింపు చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చినట్లు చెప్పారు.

ఉచిత బస్సుతో నెలకు రూ.4 వేలు ఆదా

» మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్



ప్రయాణికురాలితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఒక్కో మహిళకు నెలకు రూ.3 వేల నుంచి 4 వేల వరకు ఆదా అవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శుక్రవారం మహేశ్వరం పట్టణ కేంద్రంలో మహేశ్వరం డిపోకు చెందిన ఓ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణంపై మహిళలతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేదల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాకి ఈశ్వర్, రాజునాయక్, నడికూడ శివ, శ్రీనివాస్‌రెడ్డి, లాజర్, సుబాష్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్

» శంషాబాద్ డీసీపీ రాజేశ్



మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

షాద్‌నగర్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి ఫరూఖ్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శివారు ప్రాంతాలు, లాడ్జీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 వాహనాలను సీజ్ చేశారు. శంషాబాద్ అడిషినల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, 250 మంది పోలీసులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో గేయం ఆలపిస్తున్న విద్యార్థులు

మంచాల/కేశంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు పాండాల జంగయ్య పిలుపునిచ్చారు. వందేమాతర గేయరచన 150 వసంతాలను పురస్కరించుకున్న సందర్భంగా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. పీఏసీఎస్ డైరెక్టర్ కొంగర జనార్దన్‌రెడ్డి, మెండు వెంకట్‌రెడ్డి, కొంగర సత్తిరెడ్డి, పెద్దిరెడ్డి యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వందేమాతర గేయం దేశాన్ని ఐక్యతపరుస్తుందని వందేమాతరం కేశంపేట మండల కన్వీనర్ యుగంధర్ అన్నారు. కొండారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి వందేమాతర గేయాన్ని ఆలపించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. మాజీ వైస్ ఎంపీపీ నర్సింహ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేష్, జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను అభినందిస్తున్న రవీందర్

కొత్తూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ డోలీ రవీందర్ అన్నారు. కొత్తూరు మండలం ఇనుముల్‌నర్వలో ఐదు రోజులపాటు మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్‌మీట్‌లో భాగంగా గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీలో విజేతలుగా నిలిచిన స్టేషన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన క్రీడాకారులకు కొత్తూరు ఎంపీడీవో అరుంధతి బహుమతులు ప్రదానం చేశారు.

గౌచ్చిబౌలి టూ చేవెళ్ల

మెట్రో బస్ సర్వీస్ ప్రారంభం

చేవెళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నుంచి చేవెళ్ల వరకు నూతనంగా ఆర్టీసీ బస్ సర్వీసును ప్రారంభించినట్లు మెహిదీపట్నం డీఎం బి.మూర్తి తెలిపారు. చేవెళ్ల ప్రాంత ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థుల కోరిక మేరకు ఆర్టీసీ స్పందించి శుక్రవారం గచ్చిబౌలి నుంచి చేవెళ్ల వరకు బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ టీజీఆర్టీసీ హైదరాబాద్ సిటీ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ ఆదేశాల మేరకు మెహిదీపట్నం డిపో ఆధ్వర్యంలో మెట్రో డీలక్స్ సర్వీస్‌లను గచ్చిబౌలి నుంచి చేవెళ్ల వరకు నూతనంగా ప్రారంభించినట్లు చెప్పారు. రూట్ నంబర్ 593/316 మెట్రో బస్సు చేవెళ్ల, మొయినాబాద్, అప్పా జంక్షన్, నార్సింగ్ జంక్షన్ ద్వారా ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు ద్వారా నేరుగా గచ్చిబౌలి వరకు బస్సులు నడుస్తాయన్నారు. చేవెళ్ల నుంచి ఉదయం 7.45గంటలకు ఒక ట్రిప్పు, సాయంత్రం 4.05గంటలకు మరో ట్రిప్పు ఉంటుందని తెలిపారు. అలాగే గచ్చిబౌలి నుంచి ఉదయం 9.05 గంటలకు, అలాగే సాయంత్రం 5.25 గంటలకు బస్సు ఉంటుందన్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగితే ట్రిప్పుల సంఖ్య కూడా పెంచుతామని తెలిపారు.

వంటింట్లో మంటలు

(ఐదో పేజీ తరువాయి)

కంటే అధికంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే రైతుబజార్లలో కూడా ధరలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ బయట మార్కెట్ కంటే కొంత తక్కువ ఉన్నట్లు బోర్డుల్లో చూపుతున్నారు. కానీ అక్కడకు వెళ్లిన తరువాత గ్రేడింగ్ పద్ధతిలోనే కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. నాణ్యమైన కూరగాయలు ఇక్కడ బహిరంగ మార్కెట్ ధరలకు కొంచెం అటూ ఇటూగా అమ్ముతున్నారు. నాసిరకం కూరగాయలు మాత్రం కొంత తక్కువ ధరకు ఇస్తున్నారు.

ఏటా తగ్గుతున్న కూరగాయల సాగు

ఇదిలా ఉంటే శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ కారణంగా ఉమ్మడి జిల్లాలో ఉద్యాన పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. గతంలో హైదరాబాద్ మహానగరానికి అవసరమైన కూరగాయలను అధిక శాతం సమకూర్చే ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో కూరగాయల సాగు తగ్గిపోయింది. గడిచిన అయిదేళ్లలో దాదాపు 40వేల ఎకరాల్లో కూరగాయ పంటలు సాగు తగ్గడం గమనార్హం. గత రెండు దశాబ్దాలుగా నగర శివార్లలో ఉద్యాన పంటలు సాగు చేసే భూములన్నీ కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. దీనికి తోడు కూరగాయలు పండించే రైతులకు సరైన ప్రోత్సాహకం లభించడం లేదు. ఇక్కడ కూరగాయ రైతులు తాము పండించిన పంటను హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లకు, రైతు బజార్లకు తరలిస్తుంటారు. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కూడా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ కారణంగా కూరగాయ పంటల సాగు గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ, మొయినాబాద్, చేవెళ్ల, మర్పల్లి, పరిగి, శంకరపల్లి, మేడ్చల్, శామీర్‌పేట, కీసర తదితర ప్రాంతాల రైతులు ఎక్కువగా కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. ఇదిలాఉంటే రంగారెడ్డి జిల్లాలో ఏటా మూడు లక్షల టన్నుల కూరగాయ దిగుబడులు వస్తున్నాయి. ఇందులో 30శాతం జిల్లా అవసరాలకు వినియోగిస్తుండగా మిగతా 70శాతం నగర, శివార్లలోని మార్కెట్లకు తరలిస్తుంటారు.

రైతుల సంక్షేమానికి సాహసోపేత నిర్ణయాలు

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



కడ్తాల్‌లో లక్పతి నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు నయిమ్, శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, వెంకట్ రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్ రెడ్డి, నాయకులు కృష్ణ, ఇమ్రాన్‌బాబా, డేవిడ్, యాదయ్య పాల్గొన్నారు.

పరిహారం అందేలా చూస్తా..

కడ్తాల్: గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కారణంగా భూములు కోల్పోతున్న మండలంలోని ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ముద్విన్, ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామాల రైతులు కడ్తాలలో ఎమ్మెల్యేను కలిశారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు సర్వేను నిలిపివేయించాలని, కొంగరకలాన్ మాదిరిగా ఎకరాకు రూ.కోటి పరిహారం అందించాలని, లేదా ఇతర చోట్ల భూమికి భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రవికాంత్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, భూ నిర్వాసితులు జోగు వీరయ్య, కరుణాకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సుమన్, నారాయణ, పాండు రంగారెడ్డి, జెన్నయ్య, శంకరయ్య, పాండు, మల్లయ్య, హరీశ్, రమేశ్ ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు..

కడ్తాల నుంచి వంపుగూడ, చల్లంపల్లి మీదుగా సాలార్‌పూర్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు విస్తరణ పనులను కడ్తాల్ - తలకొండపల్లి రోడ్డులో చల్లంపల్లి గేటు వద్ద ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు యాట నర్సింహ, నరేందర్, సురేందర్‌రెడ్డి, అశోక్, గణేశ్, జవహర్‌లాల్, చందోజీ, ఇమ్రాన్‌బాబా, జహంగీర్‌అలీ, పర్వతాలు, పాల్గొన్నారు.

లక్పతి నాయక్‌కు సన్మానం

సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడికి ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి మండల గిరిజన నేతలతో కలిసి లక్పతి నాయక్ హాజరయ్యారు. కడ్తాలకు చేరుకున్న లక్పతి నాయక్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రవికాంత్ గౌడ్, చందోజీ, సుమన్, ఇమ్రాన్ బాబా, రాజేందర్, యాదయ్య ఉన్నారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో హాకా రైతు సేవా కేంద్రాన్ని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆయిల్ అంజయ్య, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, డైరెక్టర్ అంజయ్యగుప్త, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, నాయకులు అశోక్‌గుప్త, వెంకట్‌రెడ్డి, డేవిడ్, ఎండీ. ఆరీఫ్, కృష్ణగౌడ్, తిరుపతిరెడ్డి, శ్రీశైలం, రమేశ్, జగదీశ్వర్‌రెడ్డి, అబ్బాస్, విష్ణు, రవికుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మహేశ్ ఉన్నారు.

పతకాలు ఉన్నత సేవకు నిదర్శనం

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



పతకాలు అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పతకాలు సాధించడం అనేది కేవలం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, అది వారు చేసిన అత్యుత్తమ సేవకు, నిబద్ధతకు నిదర్శనమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు అందించిన ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర స్థాయి పోలీస్ సేవా పతకాలను అందజేశారు. హెచ్‌సీ.ఆర్ భీమ్ రెడ్డి అతి ఉత్కృష్ట సేవా పతకం, పీ.సీ చాకలి సురేష్ ఉత్కృష్ట సేవా పతకం, ఎస్ఐ ఏ.రమేష్, ఏఆర్ ఎస్ఐ ఏ.రషీద్, ఏఆర్ ఎస్ఐ జీ.బిచ్చప్ప, ఏఆర్ఎస్ఐ లక్ష్మణ్, హెచ్‌సీ టి.రాములకు సేవా పతకాలను అందించారు. పతకాలు అందుకున్న అధికారులను ఎస్పీ అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజలకు పోలీస్ అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాములునాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూరు డీఎస్పీ యాదయ్య, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు.. కారు ఢీ

బీజాపూర్ హైవేపై తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్

చేవెళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని దామరిగిద్ద స్టేజీ వద్ద శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్, కారు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్ హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా వికారాబాద్ వెళ్తుంది. అదే సమయంలో వికారాబాద్ నుంచి హైదరాబాద్ వస్తున్న కారు చేవెళ్ల మండల పరిధిలోని దామరిగిద్ద స్టేజీ వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు రోడ్డు పక్కకు దుసుకోపోయింది. ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

రైతులు దళారులను నమ్మొద్దు

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దోమ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కోరారు. శుక్రవారం దోమ మండల కేంద్రంతో పాటు రాకొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని నిర్వాహకులు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలని సూచించారు. తూకం, తరుగు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు తహసీల్దార్ గోవిందమ్మ, రైతులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద వీఆర్ఏల ధర్నా

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంబంధిత జీవోలను వెంటనే అమల్లోకి తేవాలని వీఆర్ఏ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. చనిపోయిన వీఆర్ఏ కుటుంబాలకు ప్రమాదబీమా, ఇన్సూరెన్స్ ప్రయోజనాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వీఆర్ఏ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. సమస్యలు పరిష్కరించపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్, కోశాధికారి చంద్రయ్య, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి జనార్దన్, నాయకులు రాజు, సంగమేశ్, రమేష్, గోపాల్, నర్సిములు, అనంతయ్య, మోహన్, సూర్యనారాయణ, హన్మంతు, అశోక్, శివ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కీసరగుట్ట గురుకులం అభివృద్ధికి రూ.కోటి

కీసర, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట గురుకుల పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎపిరోక్ విద్య సహయోగ్ సంస్థ జనరల్ మేనేజర్ బాల సుబ్రమణియన్ అన్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా గురుకుల పాఠశాల అభివృద్ధికి కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విద్య, పర్యావరణం, సమాజాభివృద్ధికి ఎపిరోక్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. రూ.కోటితో గురుకుల పాఠశాలలో హాస్టల్ నిర్మాణం, పునరుద్ధరణ పనులు, పాఠశాల భవనాల మరమ్మతులు, తరగతి గదుల ఆధునీకరణ, సృజనాత్మక, ఇంటరాక్టివ్ లెర్నింగ్ వాతావరణం, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా కోసం సోలార్ ప్లాంట్, పరిశుభ్రతకు అనుగుణంగా శానిటేషన్ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని విమర్శించే స్థాయి కవితకు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

కేశంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీని విమర్శించే స్థాయి కల్వకుంట్ల కవితకు లేదని, ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంటే జీర్ణించుకోలేకపోతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం అన్ని రాష్ట్రాలతో కలిసి బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. నాయకులు కేశంపేట మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహ యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు పల్లె అంజయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేష్, మండల ఉపాధ్యక్షుడు నర్సింహ, జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డి, యువమోర్చ కార్యదర్శి ఉదయ్ కుమార్ గౌడ్, అధికార ప్రతినిధి శివాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం


శంకర్‌పల్లి, నంబరు 21(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో శబరిమలలో మృతిచెందిన మల్లికార్జున్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. శుక్రవారం శంకర్‌పల్లి మండలంలోని బుల్కాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, అయ్యప్ప భక్తుడు గుంతల మల్లికార్జున్‌రెడ్డి శబరిమలలో మెట్లు ఎక్కుతుండగా గుండెపోటు రావడంతో మరణించారు. ఈమేరకు భీంభరత్ నాయకులతో కలిసి బుల్కాపూర్‌లో మల్లికార్జున్‌రెడ్డి మృతదేహానికి పూలమాలతోపాటు పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రారెడ్డి ఉన్నారు.

ముద్విన్ హైస్కూల్‌కు ఫిజిక్స్ టీచర్ కేటాయింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడ్తాల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా ఇస్తున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల కారణంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు విద్యార్థుల అగచాట్లు' కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. మాడ్గుల మండలం కలకొండ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజిక్స్ టీచర్ పి.రాజుకు ముద్విన్ పాఠశాలకు డిప్యూటేషన్ ఇస్తూ డీఈవో సుశీంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం పాఠశాలలో రాజు రిపోర్టింగ్ చేశారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఆయనను ముద్విన్‌కు డిప్యూటేషన్ ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు నెలలుగా పాఠశాలలో ఫిజిక్స్ టీచర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఫిజిక్స్ టీచర్‌ను నియమించాలని పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ, స్థానికుల ఒత్తిడితో విద్యాశాఖ అధికారులు ఫిజిక్స్ టీచర్‌ను నియమించినట్లు సమాచారం. కాగా ఉపాధ్యాయురాలు ప్రవీణ డిప్యూటేషన్ రద్దు చేసినా తిరిగి పాఠశాలకు రాకపోవడం విమర్శలకు తావిస్తుంది.

పాత భవనం కూల్చివేతకు అధికారుల చర్యలు



కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం

కులకచర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్తగా నిర్మించిన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. పాత భవనంలో తరగతులు నిర్వహించకపోవడంతో రాత్రి సమయంలో మందు బాబులకు అడ్డాగా, విష సర్పాలకు నిలయంగా మారింది. పలుసార్లు ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించింది. వారం క్రితం పాఠశాలకు వచ్చిన జిల్లా విద్యాధికారి రేణుకాదేవి దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. భవనాన్ని పరిశీలించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మాట్లాడారు. భవనాన్ని పరిశీలించి కూల్చివేతకు అనుమతులు ఇవ్వాలని కోరారు. పీఆర్ అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వగానే భవనాన్ని కూల్చి వేయనున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

మేడ్చల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జర్నలిస్టులు సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ నేతలు కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సలీమా మాట్లాడుతూ.. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు మెడికల్ హెల్త్‌కార్డులు అందించాలన్నారు. మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. కన్వీనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉన్నటువంటి జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కోకన్వీనర్ మల్లేష్, సభ్యులు సింగం రాజు, పాండు, రవి, నరేందర్, జర్నలిస్టులు బాలు, మోహన్‌రెడ్డి, సుధాకర్, హుస్సేన్, రోజా రాణి , సత్యనారాయణ, అరుణ్‌కుమార్, దుర్గా ప్రసాద్, సురేష్, రామ్ బాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బషీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ హెడ్ కానిస్టేబుల్ రాఘవులు సూచించారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కూడలిలో శుక్రవారం స్థానిక ప్రజలతో సమావేశమై సైబర్‌నేరాలు, మోటార్ వాహనాల చట్టం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. సైబర్ మోసానికి గురైతే 1930కి కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు



జిల్లాస్థాయి ప్రతిభాపోటీలకు ఎంపికైన విద్యార్థులు

తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా తాండూరు పట్టణం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం మండల, పట్టణ స్థాయి ప్రతిభాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాస్థాయికి ఎం.కుమార్, బి.లావణ్య, కె.గాయత్రి ప్రభుత్వ విభాగం నుంచి ఎంపికయ్యారు. శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి టి.కార్తికొరెడ్డి, హరికృష్ణారెడ్డి, వైష్ణవి, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి ఎంపికయ్యారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వేదిక నాయకులు పాల్గొని ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు కాంతయ్య మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీన కొడంగల్ జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. పరీక్షల్లో బొంరాస్‌పేట్ జడ్పీహెచ్ఎస్, చౌదర్‌పల్లి, రేగడిమైలారం, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన 18మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికవుతారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, శ్యామలయ్య, నవనీత, బాకారం మల్లయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి దోహదం



మెట్లకుంటలో చిరుధాన్యాల అల్పాహార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జయకృష్ణ

బొంరాస్‌పేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలు సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మెట్లకుంటలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాల అల్పాహార కేంద్రాన్ని ప్రారంభించారు. పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. వాసన్ సంస్థ సహాయంతో మండల రైతు సమాఖ్య ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'పోషణ వనిత' అనే కార్యక్రమంలో భాగంగా అల్పాహారం కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిదులు రాంచంద్రయ్య, కుర్వ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు



రాస్నంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు

యాలాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని రాస్నం గ్రామంలో శుక్రవారం కుమ్మరిపల్లి అరుణకు మంజూరైన ఇంటికి శుక్రవారం ముగ్గు పోశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చౌదరి మల్లారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఎన్కెపల్లి సాయన్నలు మాట్లాడుతూ ప్రభుత్వం సొంతఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు కుమ్మరిపల్లి వీరయ్య, మల్లేశం, బండారి వెంకటయ్య, గోపాల్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. గౌడవెల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, రవి, రేణుక, వినోద్ గౌడ్, సంధ్య, సింగిరెడ్డి రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● పరిగి డీఎస్పీ శ్రీనివాస్



మన్నెగూడలో మాట్లాడుతున్న పోలీసులు

పూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మన్నెగూడలో సబ్ డివిజన్ పోలీసు అధికారుతో కలిసి శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో అనుమానాస్పదంగా ఉన్న వారి ఇళ్లకువెళ్లి తనిఖీ చేశారు. అదేవిధంగా నంబర్‌ప్లేట్ లేని వాహనాలను, పత్రాలు లేని వాహనాలను పరిశీలించి, సరైన పత్రాలు లేని 40 బైక్‌లు, 44ఇతర వాహనాలను సీజ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 100మంది సిబ్బంది కమ్యూనిటీ కాంటాక్ట్‌లో పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి గిట్టుబాటు లభిస్తుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. శామీర్‌పేట రైతు సహకార సంఘం ఆవరణలో జిల్లా పౌరసరఫరాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుగుణాబాయి, డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, డీసీవో వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

(ఐదో పేజీ తరువాయి)

అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎం.సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, డీటీడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ దశరత్ సింగ్ రాథోడ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన చీరలతో ఆడపడుచులకు గౌరవం

ఆడపచులకు నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందజేసి సోదరుడిగా సీఎం రేవంత్ రెడ్డి గౌరవిస్తున్నారని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీలో అవకత వకలకు పాల్పడిందని ఆరోపించారు. ధారూరు మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాద బాధితులకు ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కేరెల్లిలో జయసుధ, కొండాపూర్ కుర్దులో యశ్వంత్ రెడ్డి, ధారూరులో నందిని, నాగమణిలకు, వికారాబాద్ పట్టణంలోని ముధకాలనీ, మెథడిస్టు కాలనీ, ఎన్నెపల్లి, ధన్నారం తండాలకు చెందిన ప్రమాద బాధితులకు రూ.2లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలకలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, అధికారులు, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోశ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మాజీ జడ్పీటీసీ పి.రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , అధికారులు పాల్గొన్నారు.



ధారూరులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అంతా మా ఇష్టం!

(ఐదో పేజీ తరువాయి)

ఏదో ఒక అధికారి ఏసీబీ దాడుల్లో దొరికిపోతున్నప్పటికిని ఇక్కడ అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. యాలాల మండలం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 దాటిన ఒక్క అధికారి కూడా కార్యాలయానికి రాకపోవడంతో అక్కడి ప్రజలు పనుల కోసం వెళ్లి అధికారుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి.

రెండు రోజులు మాత్రమే..

పలు ప్రభుత్వ శాఖల్లో అధికారులు, కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం లేదు. ఉన్నతాధికారుల వద్ద మీటింగ్ ఉందని, ఫీల్డ్‌కి వెళ్లారని చెప్పి తమ సొంత పనుల కోసం దుమ్మాలు కొడుతుండటం గమనార్హం. హైదరాబాద్ నుంచి తాండూరుకు వచ్చి విధులు నిర్వహించే అధికారులు కొంత మంది వారంలో రెండు రోజులు మాత్రమే ఇక్కడ పని చేస్తున్నారు. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకోవడం వల్ల పలుచోట్ల అటెండర్‌లే అన్నీ నడిపిస్తున్నారు. మున్సిపాలిటీలో రెగ్యులర్‌గా పని చేసే అధికారులు వివిధ సెక్షన్‌లలో లేకపోవడం వల్ల పాలన గాడి తప్పింది. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఉన్నప్పుడే ఇతర సెక్షన్‌లో అధికారులు పని చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. విద్యుత్ శాఖలో కూడా ఒక్కొక్క ఏఈకి రెండేసి మండలాలు చొప్పున బాధ్యతలు ఇవ్వడం వల్ల పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఖాళీ అయిన పోస్టుల్లో ఇతర సిబ్బందిని నియమిస్తే విద్యుత్ శాఖలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

సీఎస్ఆర్ నిధులతో పాఠశాల అభివృద్ధి చేయాలి



ఇన్ఫోసిస్ సీనియర్ రీజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇన్ఫోసిస్ ఐటీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయడంతోపాటు, స్థానిక మహిళలకు ఉపాధిశిక్షణ తరగతులు నిర్వహించాలని కోరుతూ పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి ఇన్ఫోసిస్ ప్రతినిధులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అన్నోజిగూడలోని జడ్పీ పాఠశాలలో అదనపు గదులను నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జితేందర్, కేఎంరెడ్డి, లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలు, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా బస్సు ప్రమాదంలో గాయపడిన తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గంగ్యాడ దయాకర్‌కు ప్రభుత్వం తరపున రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్‌లు గీతాసింగ్, పోలీసు రాంరెడ్డి, తహసీల్దార్ బుచ్చయ్య, నాయకులు ఎక్బాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

కీసర: ప్రభుత్వ పథకాలను నిరుపేద ప్రజలు సద్వినియోగించుకోవాలని కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌కూమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఉమ్మడి కీసర మండలానికి చెందిన బ్రహ్మారెడ్డి, గుండోజు మంజుల, సుంకోజి శ్రీనివాస్‌లు అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా బ్రహ్మారెడ్డికి రూ.42,500, మంజులకు రూ.22,500, శ్రీనివాస్‌కు రూ.60వేలు మంజూరు కాగా శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కృష్ణారెడ్డి, వెంకటేష్, బిక్షపతి, కీసర వార్డు కార్యాలయం అధికారి గంగన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్ నిత్యానంద్

ఘట్‌కేసర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషిచేయాలని పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ శ్రీనివాస్ కాలనీలో శుక్రవారం ఇటీవల హైడ్రా స్వాధీనం చేసుకున్న పార్కుస్థలంలో ఆయన కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహిపాల్‌రెడ్డి, రంజిత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, తేజ, మల్లేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శునకానికి ఘనంగా జన్మదిన వేడుక



పెద్దేముల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇందూర్ గ్రామానికి చెందిన మొగులప్ప, పద్మమ్మ దంపతులు వారి పెంపుడు శునకానికి పుట్టినరోజు వేడుక నిర్వహించారు. వీరి పెంపుడు శునకానికి గురువారం రాత్రి ఘనంగా పుట్టినరోజు వేడుక నిర్వహించారు. చుట్టుపక్కల వారిని పిలిచి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పెంపుడు కుక్కపై వారికున్న ప్రేమను చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

గ్రామాల్లోకి వెళ్లి స్థితిగతులు తెలుసుకోవాలి



దేబేంద్ర దాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఈవో సూర్యదేవర నీలిమా

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాల్లోకి వెళ్లి స్థితిగతులు తెలుసుకోవాలని యూబీఏ ఆర్‌సీఐ కో-ఆర్డినేటర్ దేబేంద్ర దాస్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ఉన్నత భారత్ అభియాన్(యూబీఏ) ఆధ్వర్యంలో అనురాగ్ ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్ ఎన్ఎస్ఎస్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా, మల్లేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు ఇందిరమ్మ చీరల పంపిణీ

తాండూరు రూరల్: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం(నేడు) మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్డీఏ, డీపీఎం శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

నేడు రిజర్వేషన్లకు లాటరీ

ధారూరు: ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 22న(శనివారం) సర్పంచ్, వార్డుమెంబర్ల స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించేందుకు లక్కీడిప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నర్సింహులు తెలిపారు.

విద్యాసంస్థలను తరలించొద్దు

కొడంగల్: మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతరప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులతో శుక్రవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భీములు, జేఏసీ కో కన్వీనర్‌లు సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలి

దౌల్తాబాద్: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. ఆయన శుక్రవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు.

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన

ధారూరు: నాగసమందర్ పీహెచ్‌సీలో శుక్రవారం యాంటీ మైక్రోబీయల్ రెసిస్టెన్స్‌పై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. జిల్లా ఎన్‌సీడీ విభాగం అధికారిణి డాక్టర్ నిరోష, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి, ప్రజలకు, రోగులకు తగుసలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అలీ, జయరాం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి సన్మానం

పెద్దేముల్: పెద్దేముల్ నుంచి బదిలీపై వెళ్తున్న వేణుకుమార్‌కు పోలీస్ సిబ్బంది సన్మానించారు. అదేవిధంగా నూతనంగా వచ్చిన ఎస్ఐ శంకర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

క్షేత్ర పర్యటనలో విద్యార్థులు

కొడంగల్: అంగడిరైచూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులను ఉపాధ్యాయులు క్షేత్రపర్యటనకు తీసుకెళ్లారు. సంగాయిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో శివమ్మ, అచ్చప్ప స్మారకార్థం రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సందర్శించారు.

దుద్యాల్: లగచర్లలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులను శుక్రవారం క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. ఈర్లపల్లి వీరభద్రేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు ఆలయ విశిష్టత, పూజలు చేసే విధానంపై వివరించారు. వినోదం కోసం ఖోఖో తదితర పోటీలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

కులకచర్ల: అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్. ఆంజనేయులు అయ్యప్పస్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బడిబయటి పిల్లల గుర్తింపునకు సర్వే

కులకచర్ల: బండవెల్కిచర్లలో సీఆర్‌పీలు బడిబయటి పిల్లల గుర్తింపుసర్వే నిర్వహించారు. సీఆర్‌పీ గంగ్యానాయక్ గ్రామంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి బడిబయట ఉన్న పిల్లలను మధ్యలో బడిలో మానేసిన విద్యార్థులను గుర్తించారు.

ధ్వజస్తంభం, బొడ్రాయి మొదటి వార్షికోత్సవం

యాలాల: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం, బొడ్రాయి మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు పేరి రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభానికి, బొడ్రాయికి పూజలు చేశారు.

బాల్య వివాహాలు చేయరాదు

యాలాల: బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి యాలాల మండలంలోని జుంటుపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మీనాక్షి, రాణి, జ్యోతి బాల్యవివాహాలపై నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు విజయనిర్మల, మొగులమ్మ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దోమ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నాయకులు శరత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బట్లచందారంలో శుక్రవారం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, విజయ్‌కుమార్, శివకుమార్, కృష్ణయ్య, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాల్యవివాహలను అరికట్టాలి

బషీరాబాద్: జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం సభ్యులు బషీరాబాద్‌లో శుక్రవారం నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాల్య వివాహలను అరికట్టాలని ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే కలిగే అనర్థాలపై ఆటపాటలతో అర్థమయ్యేవిధంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచరు శోభ, ఆశా వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగి మృతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ట్యాంకర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఐటీ ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరికి చెందిన బోసు కొండ వరప్రసాద్(29) పోచారంలోని ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం ఉప్పల్‌వైపు బైక్‌పై వెళ్తుతుండగా జోడిమెట్ల చౌరస్తా సమీపంలో వెనుకాల నుంచి వచ్చిన గ్యాస్ ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వరప్రసాద్ కుటుంబసభ్యులకు అప్పగించారు. నిర్లక్ష్యంగా గ్యాస్ ట్యాంకర్ నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బస్సుకింద పడి మహిళ..

మేడ్చల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) బస్సుకింద పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణానికి చెందిన సూరజ్ కాళీదేవి(31) శుక్రవారం స్థానిక పారిశ్రామిక వాడలోని పరిశ్రమలో పనిచేయడానికి మేడ్చల్ నుంచి ఆర్టీసీ బస్సు ఎక్కింది. మేడ్చల్ చెకపోస్టు పారిశ్రామికవాడ బస్టాండ్ వద్ద బస్సు దిగే క్రమంలో కాలుజారి బస్సు వెనుక చక్రాల కింద పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి మేడ్చల్ వచ్చి తన భర్తతో స్థిరపడిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

నకిలీ దస్తావేజుల ముఠా రిమాండ్

కీసర రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులతో ప్లాట్లను విక్రయిస్తున్న ముఠాను కీసర పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ వివరాల ప్రకారం.. కుషాయిగూడ కాప్రాకు చెందిన రత్నాకరం కోటేశ్వరి నాగారం మున్సిపాలిటీ భవానీనగర్‌లో 159గజాల స్థలాన్ని 1989లో కొనుగోలు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఆ స్థలాన్ని విక్రయించారు. దీంతో ఆమె కీసర పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన పోలీసులు మహమ్మద్‌పాషా, సత్తు మహేష్, కిరణ్, వారి అనుచరులను నిందితులుగా గుర్తించారు. డాక్యుమెంట్ రైటర్ల సాయంతో నాటి సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై తమ సంబంధీకుల పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అనతరం ఆ స్థలాన్ని పేరు మీద ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.35లక్షల రుణం పొంది గ్యాంగ్ సభ్యులు సమంగా భాగాలు చేసుకుని పంచుకున్నారు. కాగా ఈముఠా గత మూడు సంవత్సరాలుగా కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట, ప్రాంతాల్లో కనీసం 15కు పైగా ప్లాట్లలోనూ మోసపూరిత చర్యలకు దిగారు. మౌలాలి, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో దాదాపు 37మంది ఈ నేర ప్రక్రియలో భాగస్వాములైనట్లు పోలీసులు తేల్చారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన కిరణ్, మహేష్, వారి అనచరులు, డాక్యుమెంట్ రైటర్లతో సహా 17మందిని అరెస్టు చేసి, న్యాస్థానం ముందు హాజరు పరిచారు. మరి కొంత మంది పరారీలో ఉన్నారని, వారి ఆచూకీ కొరకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. యజమానులు ప్లాట్లకు సంబంధించిన రికార్డులను తరచూ తనిఖీ చేసుకోవాలని, అనుమనాస్పద రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలపాలని సీఐ ఆంజనేయులు సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మేడ్చల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం రాఘవేంద్రనగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం రెండవ అంతస్తుపై శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం చూసిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 45-50 మధ్య ఉంటుందని తెలిపారు.

పరిగిలో రూ.30లక్షలతో ఓపెన్ జిమ్



జిమ్ కేంద్రం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటయ్య

పరిగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.30లక్షలతో జిమ్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. పట్టణంలోని తిరుమల వెంచర్‌లో శుక్రవారం ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలో మూడు చోట్ల ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించామని చెప్పారు. తిరుమల వెంచర్‌లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా, మినీస్టేడియం మైదానంలో పురుషుల కోసం ప్రత్యేకంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సెంటర్లలో ప్రత్యేకంగా లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టెండర్‌లో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించామని, డిసెంబరు మొదటి వారంలోనే అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

యాలాల ఎంపీడీవోగా నాగసాయి శ్రీనిజ

యాలాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాలాల ఎంపీడీవోగా నాగసాయి శ్రీనిజను నియమించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి మల్టిజోన్-2 మండల్ పరిషత్ డెవలప్‌మెంట్ అధికార పదవికి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ పీఆర్, ఆర్ఈ డైరెక్టర్ రెఫరెన్స్ ద్వారా అభ్యర్థులను తదుపరి పోస్టింగ్ కోసం వికారాబాద్ జిల్లాకు కేటాయించారు. తెలంగాణ రాష్ట్ర, సబ్‌ఆర్డినేట్ సర్వీస్‌రూల్స్ నియమం ప్రకారం నియామకమైన తేదీ నుంచి 60రోజుల పాటు విధులకు హాజరు కాకపోతే నియామకం రద్దు చేయనున్నట్లు తెలిపారు.

పెద్దేముల్ ఎస్ఐగా శంకర్ బాధ్యతల స్వీకరణ

తాండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ ఎస్ఐగా వెయిటింగ్‌లో ఉన్న శంకర్‌కు బాధ్యతలు అప్పగించడంతో శుక్రవారం ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ చేరుకొని ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వేణును వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఇక్కడి నుంచి రిలీవ్ చేశారు. కాగా పోలీస్ సిబ్బంది ఆయనను సన్మానించారు.

దళారులను నమ్మొద్దు

తాండూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్ముకోవద్దని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం చెంగోల్, గోనూర్ గ్రామాల్లో శుక్రవారం డీసీఎంఎస్ మేనేజర్ సలీంపాషా ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జెన్నె నాగప్ప, కొనుగోలు కేంద్రాం ఇంచార్జ్ చిన్నయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజు, జర్నప్ప, తులసీరామ్, ఉదయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాను పునరుద్ధరించాలి

దోమ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దోమ ఎస్బీఐలో రూ.99కోట్లకు పైగా డబ్బులు జమ అయి బ్లాక్ అయిన ఖాతాను పునరుద్ధరించాలని దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డితో కలిసి గంజిపల్లి గ్రామ మాజీసర్పంచ్ కల్పన భర్త వెంకటయ్య బ్యాంకు మేనేజర్ మాధవరావును శుక్రవారం కోరారు. ఖాతాలోని డబ్బులతో పాటు సర్పంచ్ భర్త సొంత డబ్బులు సైతం డ్రా ఎలా జరిగిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టాలని విన్నవించారు.